
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ 3
ఆదివారం 15 సెప్టెంబరు 2024
జిల్లాల వార్తలు







కలెక్టరేట్ సమీపంలో ఫుట్‌పాత్‌పై చెత్తాచెదారం

సంగారెడ్డిలో..



పట్టణ ప్రధాన రహదారి పక్కనే నడక దారిపై వెలసిన డబ్బాలు

సంగారెడ్డిలో..

రోడ్లపై వాహనాల పార్కింగ్
ప్రధాన రహదారి పక్కన డబ్బాల ఏర్పాటు
ప్రమాదాలకు ఎదురెళ్తున్న పాదచారులు
చేష్టలుడిగిన మున్సిపల్, పోలీసు యంత్రాంగం

నడక యాతన

ఫుట్‌పాత్‌లను మింగేస్తున్న దుకాణాలు

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను వ్యాపార, వాణిజ్య సంస్థలు మింగేశాయి. ప్రజలు నడవడానికి ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు తమ సొంతమే అన్నట్టు వాడుకుంటున్నాయి. దుకాణాలకు వచ్చే వినియోగదారులు వాహనాలను రోడ్ల పైనే నిలుపుతున్నారు. దీంతో, ఫుట్‌పాత్‌లే కాదు రోడ్లు కూడా సగం వరకు ఆక్రమణకు గురవుతున్నాయి. ఫలితంగా పాదచారులు ప్రమాదాలకు ఎదురు నడవాల్సి వస్తున్నది.

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 14

నిబంధనలు గాలికి..

వ్యాపార, వాణిజ్య సంస్థలు ప్రధాన రహదారి నుంచి నిర్ణీత మొత్తం సెట్‌బ్యాక్ వదలాలి. వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించాలి. 200 చదరపు మీటర్ల పరిధిలో భవన నిర్మాణం చేపట్టినట్లయితే ముందుభాగంలో పార్కింగ్‌కు ఖాళీ స్థలం వదలాలి. 750 చదరపు మీటర్ల పరిధి కన్నా ఎక్కువ స్థలంలో బహుళ అంతస్తుల వాణిజ్య భవనాలు నిర్మిస్తే వాహనాల పార్కింగ్ కోసం సెల్లార్ ఏర్పాటు చేయాలి. కానీ సంగారెడ్డి పట్టణంలో మాత్రం ఇటువంటి నిబంధనలేమీ కనిపించవు. వాణిజ్య సముదాయం ముందు పార్కింగ్ కోసం స్థలం కేటాయించకపోగా.. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను సైతం ఆక్రమిస్తున్నారు. వాణిజ్య భవనాల సెల్లార్లలో కూడా దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెకిస్తున్నారు. ప్రధాన రహదారిపై పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై కొందరు ప్రజా ప్రతినిధులు పలుకుబడి ఉపయోగించి డబ్బాలు ఏర్పాటు చేసి వివిధ వ్యాపారాల కోసం అద్దెకిస్తున్నారు. గతంలో ఓ ఎస్పీ పట్టణంలోని అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలకు నోటీసులు పంపారు. దుకాణాలకు వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు చూపించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆదేశించారు. కొద్దిరోజులకు షరామామూలే అన్నట్లు మారిపోయింది.

పట్టించుకోని అధికారులు

జిల్లాస్థాయి అధికారులందరూ ఉండే పట్టణంలోనే ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నప్పటికీ ఇటు మున్సిపల్ అధికారులు కానీ, అటు పోలీసులు కానీ పట్టించుకోవడం లేదు. ముడుపులు ముడుతుండటంతో వారు ఇటువైపు చూడడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



హైవే పక్కన ఫుట్‌పాత్‌పై పంక్చర్ షాప్



ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారం

రోడ్డుపక్కన నిలిపిన క్రేన్‌లు



ఫుట్‌పాత్ పైనే ఓ దుకాణం సామాను

రోడ్డుపక్కనే వాహనాల పార్కింగ్

పాఠశాలలకు నిర్వహణ, స్పోర్ట్స్ గ్రాంటు

ప్రస్తుత విద్యాసంవత్సరానికి 50 శాతం మంజూరు

సంగారెడ్డి జిల్లాకు రూ. 2.44 కోట్లు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14 : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, క్రీడల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 50 శాతం నిధులను ప్రభుత్వం శనివారం విడుదల చేసింది. సంగారెడ్డి జిల్లాలో 1,229 ప్రభుత్వ పాఠశాలలుండగా.. వీటి నిర్వహణ, స్పోర్ట్ గ్రాంటు కింద రూ.2.44 కోట్లు మంజూరు చేసింది. పాఠశాలల్లో చదువుతున్నవిద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం ఈ గ్రాంటు విడుదల చేస్తుంది. 1-30 మంది విద్యార్థులుంటే రూ.10 వేలు, 31-100 విద్యార్థులుంటే రూ.25 వేలు, 101-250 మంది ఉంటే రూ. 50 వేలు, 251-వెయ్యి మంది ఉంటే రూ. 75 వేలు, వెయ్యి కంటే ఎక్కువ విద్యార్థులున్న స్కూళ్లకు రూ.లక్ష నిధులను ప్రభుత్వం కేటాయించింది. క్రీడలకు సంబంధించి ప్రాథమిక పాఠశాలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.10 వేలు, ఉన్నత పాఠశాలకు రూ. 25 వేల చొప్పున కేటాయింపులు చేసింది. పాఠశాల నిర్వహణ నిధులను చాక్‌పీసులు, డస్టర్లు, తెల్లకాగితాలు, హాజరు పట్టికలు, మరుగుదొడ్ల నిర్వహణ, కంప్యూటర్ సామగ్రి కొనుగోలు, పరీక్షల నిర్వహణ, జాతీయ పండుగల నిర్వహణ, గదుల్లో విద్యుద్దీపాలు, ఫ్యాన్లు, ఇతరత్రా మరమ్మతులకు ఈ నిధులు వెచ్చించనున్నారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మనియార్‌పల్లిలో డయేరియా కలకలం

కోహీర్ సెప్టెంబరు 14: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం మనియార్‌పల్లి గ్రామంలో డయేరియా వ్యాపించింది. గ్రామానికి చెందిన పది మంది శనివారం వాంతులు, విరేచనాలతో మంచంపట్టారు. వీరిలో ఇద్దరు జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో, ముగ్గురు కోహీర్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అప్రమత్తమైన బిలాల్‌పూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గ్రామంలో హెల్త్‌క్యాంపును ఏర్పాటు చేశారు. ఐదుగురు బాధితులకు చికిత్స అందజేశారు. అనంతరం ఇంటింటి జర సర్వే నిర్వహించారు. ఐదు రోజుల క్రితం కూడా ఆరుగురు ఇలాగే అతిసార బారినపడినట్లు గ్రామస్థులు తెలిపారు. మరికొంతమంది కూడా ప్రైవేటు ఆస్పత్రుల్లో వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో పారిశుధ్యం లోపించడంతోనే గ్రామంలో అతిసార వ్యాపిస్తున్నది గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాలువల్లో మురుగు పేరకుపోయి పొంగిపొర్లుతున్నది. తాగునీటి పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి డ్రైనేజీ నీరు కలుస్తున్నది. డయేరియా కలకలంతో అప్రమత్తమైన మిషన్ భగీరథ అధికారులు తాగునీటిని పరీక్షించారు. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు పారిశుధ్య పనులు చేయించారు.

జ్వరంతో బాలిక మృతి



సహస్ర (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబరు 14 : మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో జ్వరంతో బాధపడుతూ ఏడేళ్ల బాలిక శనివారం మృతి చెందింది. పట్టణంలోని శివాలయం వీధిలో ఉండే జింకల నర్సింగ్, లహరి దంపతుల కుమార్తె సహస్ర(7)కు జ్వరం రావడంతో మూడు రోజులుగా స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. శనివారం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోయింది. బాలిక నర్సాపూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

సంగారెడ్డి పట్టణంలో 17న నిమజ్జనం ● 300 మంది పోలీసులతో భద్రత





సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 14 : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో ఈనెల 17వ తేదీన వినాయక నిమజ్జనానికి మున్సిపల్, పోలీసుశాఖలు సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. సంగారెడ్డి పట్టణంతో పాటు మండలంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో దాదాపు 200 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాలన్నింటినీ పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో నిమజ్జనం చేయనున్నారు. ఇందుకోసం సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, డీఈ ఇంతియాజ్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువు వద్ద ప్రత్యేక లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తా చెదారాన్ని తొలగించి బారికేడ్లను ఏర్పాటు చేశారు. విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడానికి రెండు క్రేన్‌లను ఏర్పాటు చేయనున్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో మండపాల వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలను చెరువు వద్దకు తీసుకువచ్చే వాహనాల్లో పెట్టడానికి మరో క్రేన్‌ను ఏర్పాటు చేశారు. చెరువు వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా మున్సిపల్ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

భారీ బందోబస్తు

నిమజ్జనానికి పోలీసులశాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నది. భద్రత కోసం 300 మంది పోలీసులను వినియోగించనున్నది. జిల్లా ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ సత్తయ్య నేతృత్వంలో సీఐలు, ఎస్‌ఐలు భద్రతా విధుల్లో పాల్గొననున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణంతో పాటు మహబూబ్‌సాగర్ చెరువు వద్ద భారీగా పోలీసులు బలగాలను మోహరించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

డీజేలు, లేజర్ లైటింగ్‌లు వద్దు

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 14: వినాయక నిమజ్జనంలో అధిక శబ్దాల డీజేలు ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం తక్కువ డేసిబుల్ స్పీకర్లను వినియోగించాలని పేర్కొన్నారు. అలాగే వినాయకుడి ఎదుట లేజర్ షో ఏర్పాటు చేస్తున్నారని, లేజర్ కిరణాలు పడి కళ్లు పోయే ప్రమాదముందని హెచ్చరించారు. లేజర్‌షో, లేజర్ లైటింగ్‌కు అనుమతి లేదని, ఎక్కడైనా ఏర్పాటుచేస్తే మండపాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీసుల సూచనలు పాటించాలని, ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా నిర్వాహకులు సహకరించాలని కోరారు.

11 ఏళ్ల నిరీక్షణకు తెర

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు

తెల్లవారుజామున ఆర్డర్ కాపీలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 26 స్కూళ్లలో 400 మందికిపైగా స్థానచలనం

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 14 : ఎట్టకేలకు మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తయింది. 11 సంవత్సరాలుగా బదిలీలు లేక ఒకేచోట పనిచేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఊరట లభించింది. 2013 సంవత్సరంలో మోడల్ స్కూల్‌లను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టగా ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. చాలా కాలంగా బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. కాగా గతేడాది బదిలీల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టగా పలువురు కోర్టును ఆశ్రయించడంతో బ్రేక్ పడింది. ఇటీవల కోర్టు బదిలీలు సబబే అని తేల్చడంతో ప్రక్రియను చేపట్టారు. శనివారం తెల్లవారుజామున ఉపాధ్యాయులందరినీ బదిలీలు చేస్తూ ఆర్డర్ కాపీలు అందజేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం వరకు ఆర్డర్ కాపీలు అందజేశారు. ఆర్డర్ కాపీలను పొందిన ఉపాధ్యాయులు ఆగమేఘాలపై బదిలీ అయిన పాఠశాలకు వెళ్లి జాయిన్ అయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఆర్డర్ కాపీలు అందజేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 26 మోడల్ స్కూల్‌లు ఉండగా 400 మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. సిద్దిపేట జిల్లాలో 14 మోడల్ స్కూల్ ఉండగా 200పైగా టీచర్లు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు.

అంతస్తుకో రేటు..

దర్జాగా కట్టు..!

‘ఔటర్’ సమీప గ్రామాల్లో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నా పంచాయతీ అనుమతులు

తోడ్పాటు అందిస్తున్న పాలకవర్గాలు, సెక్రెటరీలు

స్పందించని ఉన్నతాధికారులు

పటాన్‌చెరు, సెప్టెంబరు, 14: ఔటర్ రింగ్‌రోడ్డును ఆనుకుని ఉన్న పలు గ్రామ పంచాయతీల పరిధిలో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలు హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్నప్పటికీ స్థానిక పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది దొడ్డిదారిన అనుమతులు జారీ చేస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన అనంతరం అక్రమ కట్టడాలు వేగం పుంజుకోవడం గమనార్హం. ఒక్కో భవన నిర్మాణ అనుమతికి రూ. 10 లక్షల నుంచి రూ. 15లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ తరువాత ఒక్కో అక్రమ అంతస్తుకు రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

ఔటర్ పక్కనే అక్రమ నిర్మాణాలు

పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల పరిధిలోని ఇంద్రేశం, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, ఇస్నాపూర్, ముత్తంగి, బానూర్ తదితర గ్రామాలు నెహ్రూ ఔటర్‌రింగ్ రోడ్డుకు సమీపంలో ఉంటాయి. ఇక్కడ అపార్ట్‌మెంట్‌లు, వాణిజ్య భవనాల నిర్మాణం జోరందుకుంది. పటాన్‌చెరు నుంచి ఇంద్రేషం వెళ్లే రోడ్డుకు ఇరువైపులా భారీ వ్యాపార సముదాయాలు నిర్మిస్తున్నారు. జీప్లస్-2 చొప్పున పంచాయతీ నుంచి అనుమతులు తీసుకుని నాలుగంతస్తులను నిర్మిస్తున్నారు. ఇస్నాపూర్ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి అభిముఖంగా,



ఇంద్రేశం పీఎస్‌ఆర్ కాలనీలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్

పాశమైలారం వెళ్లే రోడ్డులో ఉన్న ఒక్క భవనం కూడా నిబంధనలకు లోబడి లేదు. ముత్తంగి ఔటర్ జంక్షన్ వద్ద అనేక నిర్మాణాలు కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. ఇక్కడ జాతీయ రహదారి పక్కనే మంజీరా పైపులను వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన దుకాణాల సముదాయంపై అనేక ఫిర్యాదులు వచ్చినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. అమీన్‌పూర్ మండలం ఇంద్రేశం పంచాయతీ పరిధిలో పిట్టగూళ్లను తలపించేలా ప్లాట్లు కట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క పీఎస్‌ఆర్ కాలనీలోనే 50వరకు అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. కిష్టారెడ్డిటలో బహుళ అంతస్తుల నిర్మాణాలు కిక్కిరిసిపోతున్నాయి. దుర్గానగర్‌లో నిర్మించిన అపార్ట్‌మెంట్లలో 90 శాతం అక్రమ అంతస్తులే కావడం గమనార్హం. ఇటీవల పలు గ్రామాలు మున్సిపల్‌లో విలీనం ప్రతిపాదనలు రాగానే.. పంచాయతీల నుంచి పెద్దఎత్తున నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున డబ్బుల చేతులు మారినట్లు ప్రచారం జరుగుతున్నది. మున్సిపాలిటీలో విలీనంతోనైనా పంచాయతీల పరిధిలో అక్రమ కట్టడాలకు అడ్డకట్ట పడుతుందా అనే సందేహం వ్యక్తమవుతోంది.

కొనసాగుతున్న సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

కల్హేర్, సెప్టెంబరు 14: సిర్గాపూర్ మండల పరిధిలోని 27 గ్రామపంచాయతీల్లో శనివారం నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ కొనసాగుతున్నట్లు సిర్గాపూర్ ఎంపీడీవో మల్సూర్‌నాయక్, ఈజీఎస్ ఏపీవో బస్వరాజ్ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలోని అన్ని గ్రామపంచాయితీల్లో చేపట్టిన ఈజీఎస్ పనులపై ఆడిట్ నిర్వహిస్తారని వారు తెలిపారు. ఇందుకోసం ఒక ఎస్ఆర్పీ ఆధ్వర్యంలో 13 మంది డీఆర్పీలు సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆడిట్ ఈనెల 22 వరకు కొనసాగుతుందని, 23న సిర్గాపూర్‌లోని ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో, ఎంపీవో తెలిపారు.

ప్రతిభకు పురస్కారం అభినందనీయం



ఇంటర్‌లో ప్రతిభచాటిన భవాని, తల్లిదండ్రులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

జహీరాబాద్, సెప్టెంబరు 14: ప్రతిభచాటిన విద్యార్థులకు లింగాయత్ సమాజ్ ఉద్యోగులు, నాయకులు పురస్కారాలు, సన్మానాలు చేయడం అభినందనీయమని హైదరాబాద్ అదనపు ఎస్పీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని దత్తగిరి కాలనీలోగల బసవేశ్వర మండపంలో లింగాయత్ సమాజ్ ఉద్యోగులు పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో సంస్కారంతో కూడిన విద్య ఉంటే భవిష్యత్తులో మంచి ప్రయోజకులు అవుతారన్నారు. గురువులైనా, తల్లిదండ్రులైనా పిల్లలను సమాజానికి ఉపయోగపడే విధంగ తయారుచేయాల్సిన అవసరం ఉందన్నారు. లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్ తదితరులు మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం అత్యవసరమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, సమాజ్ ఉద్యోగ సంఘం, లింగాయత్ సమాజ్ నాయకులు నాగేశ్వర్, విజయ్‌కుమార్, సుభాష్, అశోక్ చెంద్రే, ప్రభుకుమార్, నవీన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన బైక్

మనోహరాబాద్, సెప్టెంబరు 14: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన ర్యాకాల సాయి సుశాంక్, తన స్నేహితుడు అభిలాష్‌రెడ్డి శుక్రవారం రాత్రి బైక్‌పై మనోహరాబాద్ నుంచి కాళ్లకల్ వెళ్లి తిరిగి వస్తున్నారు. దండుపల్లి ఐటీసీ పరిశ్రమ 44వ జాతీయ రహదారి తెలంగాణ క్రీడా ప్రాంగణం వద్దకు రాగానే వెనక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయి సుశాంక్, అభిలాష్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్నేహితులు క్షతగాత్రులను మేడ్చల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనకు కారకుడైన బొలెరో వాహనం డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ర్యాకాల సాయి సుశాంక్ బంధువు ర్యాకాల సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బొంతపల్లిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుమ్మడిదల, సెప్టెంబరు 14: గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామికవాడలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బొంతపల్లి పారిశ్రామికవాడలోని రక్షిత్ డ్రగ్స్ పరిశ్రమ వెనకాల గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతిచెందినట్లు.. గ్రామపంచాయతీకి సమాచారం ఇచ్చారు. బిల్ కలెక్టర్ గౌరీశంకర్, పెద్దరాజ్ సంజీవరెడ్డితో కలిసి వెళ్లి చూడగా.. సర్వే నంబరు 466లో వ్యక్తి ఉరేసుకుని మృతిచెంది కుళ్లిపోయిన స్థితిలో కనిపించాడు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, ఐదురోజుల క్రితమే ఉరేసుకుని చనిపోయినట్లు అక్కడ పరిస్థితిని చూస్తే తెలుస్తుందన్నారు. మృతుడు ఆకుపచ్చ, నల్ల రంగు లుంగీ, తెల్ల బ్లూ కలర్ చొక్కా ధరించాడని, ఆచూకీ తెలిసిన వారు గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు. బిల్ కలెక్టర్ గౌరీశంకర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో..

ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దిభాకర్ బెహరా(19) అన్నారం గ్రామంలోని ప్రకృతివనం వెనకభాగంలో రేకులషెడ్డులో అద్దెకు నివాసముంటున్నాడు. అయితే శనివారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని సమాచారం రావడంతో.. మృతుడి చిన్నాన్న రవీందర్, అతడి స్నేహితులు వెళ్లి చూడగా బెహరా విగతజీవిగా కనిపించాడు. మృతుడి చిన్నాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

సామాజిక బహిష్కరణపై విచారణ



గౌతోజీగూడెంవాసులతో మట్లాడుతున్న వెంకట్ రెడ్డి

మనోహరాబాద్, సెప్టెంబరు 14: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెంలో ఓ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేసిన విషయంపై శనివారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు. గత మంగళవారం గ్రామానికి చెందిన చంద్రం, అతని తమ్ముడు అర్జున్ శుభకార్యాలకు డప్పు కొట్టడం లేదన్న కారణంతో తమను సామాజిక బహిష్కరణ చేశారంటూ జిల్లా ఎస్పీకి ఎక్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు గ్రామానికి చెందిన 19 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవాలతో గణపతి చిత్రం



గజ్వేల్, సెప్టెంబరు 14: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గజ్వేల్ పట్టణానికి చెందిన రామ కోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ రాజు శనివారం ఆవాలతో గణపతి చిత్రాన్ని తయారు చేసి ఆవిష్కరించారు.

వినాయకుడి వద్ద ముస్లిం అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న మహమ్మద్ గౌస్

నిజాంపేట, సెప్టెంబరు 14 :మండల పరిధిలోని రాంపూర్‌లో గాంధీ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద గ్రామానికి చెందిన మహమ్మద్ గౌస్ అనే ముస్లిం వ్యక్తి తన సొంత ఖర్చులతో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు అతడికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం



అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంట

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 14 : మండలంలోని మలుపల్లిలో రైతు చిటుకుల లక్ష్మణ్ రెండు ఎకరాల వరి పంటను సాగు చేశాడు. పంట చేతి కొచ్చే సమయంలో అడవి పందులు పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. అప్పు చేసి పంట సాగు చేశానని ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మంత్రుల కమిటీని రద్దు చేయాలి

● ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

నిజాంపేట, సెప్టెంబరు 14 : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. నిజాంపేటలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు ర్యాకం శ్రీరాములు మాట్లాడుతూ ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా వర్గీకరణ అమలు పేరుతో కమిటీ వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఏకపక్షంగా ఉన్న మంత్రుల కమిటీతో మాల, మాల ఉప కులాలకు ఏమాత్రం న్యాయం జరగదన్నారు. ఈ కమిటీ స్థానంలో న్యాయమూర్తితో కమిషన్ వేయాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు బండారు చంద్రయ్య, దుబాసి సంజీవ్, రాగుల బాబు, ఎండపల్లి వినోద్, టంకరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ.. తప్పిన ప్రమాదం



జగ్గంపేటలో వర్షాల ప్రభావంతో కూలిన పెంకుటిల్లు

చిలప్‌చెడ్, సెప్టెంబరు 14: ఇంటి గోడ కూలిన ఘటన మండలం పరిధిలోని జగ్గంపేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాజిపేట భిక్షపతికి చెందిన పెంకుటిల్లు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని శనివారం ఉదయం గోడ ఆకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో, ఆ పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇల్లు కూలిపోవడంతో తన కుటుంబానికి నిలువనీడ లేకుండా పోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నారు.

కాలుష్య జలాలు తాగి పాడిగేదె మృతి

జిన్నారం, సెప్టెంబరు 14: జిన్నారం మండం కాజీపల్లిలో కాలుష్య జలాలు తాగి పాడిగేదె మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఓ నెమలి కూడా మృత్యు వాత పడిందన్నారు. మృతి చెందిన పాడిగేదె ఎవరిదన్న విషయం తెలియరాలేదు.

రోడ్డంతా గుంతలే..

ఒళ్లు హూనం.. షెడ్లకు వాహనాలు

- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- వెంటనే మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. పలుచోట్ల రహదారులు కోతకు గురికాగా, కొన్ని ప్రాంతాలు రోడ్లు, కల్వర్లు కుంగాయి. అడుగడుగునా గుంతల రోడ్లతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గజ్వేల్: అధ్వానంగా మారిన అల్వాల్ రహదారి



నంగునూరు : వెంకటాపూర్ పాలమాకుల మధ్య రోడ్డుకు పగుళ్లు

గజ్వేల్/మిరుదొడ్డి/చిన్నకోదూరు/నంగునూరు, సెప్టెంబరు 14 : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముట్రాజ్‌పల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇక గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రోడ్డులో అనేక చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు ఈ గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డులో సిటిజన్స్ క్లబ్ వద్ద వన్-వే రోడ్డు వేయకుండా పెండింగ్‌లో పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజ్ఞాపూర్‌లోని జగదేవ్‌పూర్ రోడ్డులో వరద ధాటికి సైడ్ బార్మ్‌లు కొట్టుకుపోయి మోకాలి లోతు గుంతలు పడ్డాయి. ఏదైనా పెద్ద వాహనం ఎదురుగా వస్తే కిందకి దింపుకున్న వాహనం సదరు గుంతలో పడే ప్రమాదమున్నది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు. మిరుదొడ్డి మండలంలోని అల్వాల్ నుంచి తోగుట, సిద్దిపేట.. మిరుదొడ్డి నుంచి కాసులాబాద్, మోతె.. అందె చెప్యాల నుంచి మాధన్నపేట.. కొండాపూర్ నుంచి లక్ష్మీనగర్ ఆశ్రమం వద్దకు వెళ్లే ఆర్అండ్‌బీ, పీఆర్ రోడ్డు కంకరతేలి అధ్వానంగా మారాయి.



కంకర తేలిన కొండాపూర్ నుంచి లక్ష్మీనగర్ ఆశ్రమం వద్దకు వెళ్లే రోడ్డు

కుంగిన రోడ్డు, కల్వర్టు..

చిన్నకోదూరు మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం సమీపకాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ వేయడానికి గతంలో సీసీ రోడ్డును తవ్వారు. పైపు లైన్ వేసిన తర్వాత చేపట్టిన మరమ్మతుల్లో నాణ్యాత ప్రవమాణాలు పాటించకపోవడంతో కొన్ని రోజులకే సీసీ రోడ్డు కుంగిపోయింది. నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, రాత్రిల్లో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు, వాహనదారులు వాపోతున్నారు. నంగునూరు మండలం పాలమాకుల నుంచి వెంకటాపురం మీదుగా తిమ్మాపల్లి వెళ్లే రహదారిలోని కల్వర్టు కుంగింది. ఆరు నెలల క్రితమే కల్వర్టు పై బీటీ రోడ్డు నిర్మించడంలో నాణ్యాతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే కుంగిపోతున్నదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు ఉన్నట్టు సూచికల బోర్డు కూడా పెట్టలేదని వాపోతున్నారు. అలాగే చిన్నకోదూరు మండలం మల్లారం నుంచి నంగునూరు మండలం పాలమాకుల మీదుగా వెంకటాపూర్ తిమ్మాయపల్లి బందారం వరకు రింగు రోడ్డు పనులు చేపట్టారు. విస్తరణ పనులకు సంబంధించి ఎలాంటి సూచికల బోర్డు లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇక పాలమాకుల గ్రామపంచాయతీ ముందు నుంచి వెంకటాపూర్ వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైందని వెంటనే మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు..



చిన్నకోదూరు: చితికిన సీసీ రోడ్డు



నంగునూరు: వెంకటాపూర్ వద్ద కుంగిన కల్వర్టు



గజ్వేల్ పట్టణంలోని ముట్రాజ్‌పల్లి మూలమలుపు వద్ద రోడ్డుపై గుంతలు

కుట్టుమిషన్లు, ప్లేట్లు అందజేత



ప్రభుత్వ పాఠశాల బాలికకు కుట్టుమిషన్ బహుకరిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఈవాఫెల్‌నర్

పటాన్‌చెరు, సెప్టెంబరు 14: గ్రామీణ ప్రాంతాల్లోని బాలికల విద్య ఆర్థిక స్వావలంబనకు జర్మన్ ఆఫ్ రోజ్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు రాబర్ట్ ఫెల్‌నర్, ఈవాఫెల్‌నర్‌లు పేర్కొన్నారు. శనివారం పటాన్‌చెరు ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో 500 మంది విద్యార్థులకు ప్లేట్లు, ముగ్గురు బాలికలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో బాలికలు ఎంబ్రాయిడరీ, అల్లికలపై శిక్షణ ఇచ్చి మెరిట్ ఆధారంగా సర్టిఫికెట్లను జారీ చేశామన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం స్పందన, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శేషయ్య, వీవీ. రావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలి

● దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు సిద్దార్థ



సంఖపూర్ చేరుకున్న పాదయాత్ర

చేగుంట, సెప్టెంబరు14: దళితులకు సమ న్యాయం జరుగాలంటే ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెరా సిద్దార్థ అన్నారు. దళిత సమన్యాయం పాదయాత్ర నార్సింగి మండలం సంఖపూర్‌కు శనివారం చేరుకోగా దళితులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సిద్దార్థ మాట్లాడుతూ 70 సంవత్సరాలుగా అమలవుతున్న ఎస్సీ రిజర్వేషన్ల ఫలాలు పొంది 3 శాతం మంది దళితులు సంపన్నవర్గంగా మారారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేస్తూ చట్టం తీసుకువచ్చి నిరుపేద దళిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. ఈ యాత్ర 40 రోజుల పాటు కొనసాగి గద్వాల జిల్లా అలంపూర్‌లో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొమ నగేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రాజు, నాయకులు పాల్గొన్నారు.

బేస్ బాల్ పోటీల్లో సిద్దిపేట జిల్లా విజయం



విజయం సాధించిన సిద్దిపేట జిల్లా జట్టు

వర్గల్, సెప్టెంబరు 14 : నిర్మల్ జిల్లాలో జరుగుతున్న 5వ తెలంగాణ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్టిక్ బేస్ బాల్ చాంపియన్‌షిప్‌లో సిద్దిపేట జిల్లా (అండర్ 15) బాలుర జట్టు విజయం సాధించినట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి తెలిపారు. శనివారం జిల్లా జట్టు నిర్మల్, మెడ్చల్ జట్లను ఓడించి ప్రీ క్వాటర్ ఫైనల్‌కు చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధు యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

మోడల్ కళాశాల..!

- 300 సీట్లకు 120 మంది చేరిక
- చేరేందుకు విద్యార్థుల అనాసక్తి
- వృత్తివిద్యా కోర్సులు ఉంటే మేలు



నారాయణఖేడ్, సెప్టెంబరు 13: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి ఆశయంతో మోడల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసినప్పటికీ, విద్యార్థులు లేక కళాశాల వెలవెలపోతుంది. దేశ వ్యాప్తంగా 374 మోడల్ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేస్తే, ఉమ్మడి రాష్ట్రంలో ఏడు, తెలంగాణలో రెండు నారాయణఖేడ్, ఎల్లారెడ్డిలలో మాత్రమే ఉన్నాయి. అయితే ప్రస్తుత ఎంపీ సురేష్ షెట్కార్ కృషితో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే మోడల్ కళాశాలలు ఏర్పాటయ్యాయి. డిగ్రీ కళాశాల భవనాన్ని రూ.14 కోట్లు వెచ్చించి, అద్భుతంగా నిర్మించారు. ప్రభుత్వం దోస్త్ ద్వారా సీట్లను భర్తీ చేస్తుండడంతో, ఇప్పటివరకు మొదటి సంవత్సరంలో కేవలం 120 మంది మాత్రమే ప్రవేశం పొందారు. నారాయణఖేడ్‌లో బీఏ కు సంబంధించి తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో బీకాం కంప్యూటర్, అప్లికేషన్, బీఎస్సీ బీజెడ్, బీఎస్సీ బీజెడ్‌సీఎస్, ఎంపీసీ, ఎంపీసీఎస్, సీబీఎస్‌ఈ తరగతులు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో 300 సీట్లు ఖాళీగా ఉంటే, కేవలం 120 మంది మాత్రమే ప్రవేశం పొందారు. ద్వితీయ సంవత్సరంలో 100 మంది, తృతీయ సంవత్సరంలో 81 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కళాశాలలో 900 మంది వరకు విద్యార్థులు చదువుకునే అవకాశం ఉన్నప్పటికీ, కేవలం 281 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నారాయణ రెగ్యులర్ కాగా, అన్ని విషయాలకు సంబంధించి బోధించడానికి నలుగురు కాంట్రాక్ట్ అధ్యాపకులు, 8 మంది గెస్ట్ ఫ్యాకల్టీ ఉన్నారు. బీఏ మినహా మిగతా విషయాల్లో ఆంగ్ల మాధ్యమం ఉండడంతో, ప్రవేశానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని తెలుస్తుంది. వృత్తి విద్యా కోర్సులు ఉంటే, విద్యార్థుల సంఖ్య పెరుగవచ్చునని పలువురు అంటున్నారు. ఏది ఏమైనా నారాయణఖేడ్‌లో అన్ని హంగులతో విశాలమైన స్థలంలో మోడల్ డిగ్రీ కళాశాల భవనాన్ని అప్పట్లో ఎంపీగా ఉన్న సురేష్ షెట్కార్, అప్పటి ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డిలు మంజూరు చేయించి, నిర్మింపజేసినప్పటికీ ఫలితం దక్కడం లేదు. మొదట్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉన్నప్పటికీ, రానురాను విద్యార్థులు ప్రవేశం పొందక పోవడంతో వెలవెలపోతుంది.

విద్యార్థులు ప్రవేశం పొందే విధంగా అవగాహన కల్పిస్తున్నాం



ఈ కళాశాలలో విద్యార్థులు ప్రవేశం పొందే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. కళాశాలలో అన్నివసతులు విశాలమైన భవనం ఉన్నప్పటికీ, తెలుగు మాధ్యమంలో తరగతులు లేక విద్యార్థులు ముందుకు రావడం లేదు. విశ్వవిద్యాలయంవారు తెలుగు మాధ్యమంలో తరగతులను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుంది. - నారాయణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనందించాలి

● హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి, సెప్టెంబరు 14: పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనందించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. హసన్‌పర్తి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ కృషితో శనివారం ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాలకు విరివిగా విరాళాలు వచ్చాయి. ఈక్రమంలో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులకు కలెక్టర్ ప్రావీణ్య రూ.7లక్షల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. అనంతరం ప్రావీణ్య మాట్లాడుతూ.. పాఠశాల, కళాశాల అభివృద్ధి కోసం సంగారెడ్డి ఎస్పీ చెన్నూరు రూపేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దాతలను ఘనంగా సన్మానించారు. కార్యకమంలో తహసీల్దారు చల్ల ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బైకుల దొంగ అరెస్టు

● 18 వాహనాలు స్వాధీనం



శివ్వంపేటలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

శివ్వంపేట, సెప్టెంబరు 14 : జల్సాలకు అలవాటుపడి పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను తస్కరించి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. మండలంలోని కొత్తపేట రూప్లాతండాకు చెందిన జేర్పుల మోహన్ (27) హైదరాబాద్, కేపీహెచ్‌బీ, శివ్వంపేట, మనోహరాబాద్, నార్సింగి, సనత్‌నగర్, కొల్చారం, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన 17 బైకులు, ఒక స్కూటీ అపహరించాడు. ఇందులో 5 వాహనాలను నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల నరేష్‌కు విక్రయించారు. దీంతో వారిద్దని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 6 పల్సర్, 2 యూనికార్న్, 2 షైన్, 2 స్ప్లెండర్, 1 పాష్యన్ , 1 గ్లామర్, 1 హోండా, 1 హోండా ఆక్టివా స్వాధీనం చేసుకోగా.. మరో 2 వాహనాల అడ్రస్ గుర్తించ లేదు. అలాగే ఆగస్టు 30న శివ్వంపేట మండలం బోజ్యాతండాలో మధ్యాహ్నం ఆజ్మీర ఇంటి తాళాలు పగలగొట్టి రూ.55 వేలను దొంగలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నిందితుడి గుర్తించి విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి ఖర్చు చేయగా మిగిలిన రూ.20 వేలను రికవరీ చేశారు సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్సై మహిపాల్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


దొంగకు రిమాండ్



నిందితుడిని మీడియాకు చూపుతున్నపోలీసులు

గజ్వేల్, సెప్టెంబర్ 14: దొంగతనం కేసు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 9న గజ్వేల్ మండలం దిలాల్‌పూర్‌కు చెందిన క్యాసారం సత్తవ్వ ఇంటికి తాళం వేసి కీని బయట సెల్ఫ్‌లో పెట్టి తన భర్తతో కలసి పని నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లింది. 11న సాయంత్రం ఇంటికి తిరిగొచ్చి చూడగా బీరువాలోని రూ.80వేల నగదు, 20 తులాల వెండి కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు టెక్నాలజీ సహాయంతో దిలాల్‌పూర్ గ్రామానికి చెందిన సిరిసిల్ల మల్లయ్య(55)ను నిందితుడిగా గుర్తించి అతడి వద్ద నుంచి రూ.80 వేల నగదు, 20 తులాల వెండి పట్ట గొలుసులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరగా ఛేధించిన గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, ఏఎస్సైలు యాదగిరి, పండరి, కానిస్టేబుళ్ల నవీన్, రవి, నరేందర్, వెంకటేష్‌లను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అభినందించి, రివార్డు నిమిత్తం సీపీకి సిఫారసు చేశారు

కారు, ఆటో ఢీ.. వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రభాకర్

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 14 : ఆటోను కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మెదక్ మండలం మంబోజిపల్లి శివారులో చోటు చేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొల్చారం మండలం అంసాన్‌పల్లికి చెందిన తుమ్మలపల్లి ప్రభాకర్(45) వ్యవసాయం చేయడంతోపాటు ఆటో నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి మెదక్ నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో కారు అతి వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడి మృతి



గంట శ్రీను

నర్సాపూర్, సెప్టెంబరు 14: ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆవంచ గ్రామానికి చెందిన గంట శ్రీను(26) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వినాయకుడిని నిమజ్జనానికి తరలించేందుకు ట్రాక్టర్‌ను కడిగి తీసుకువస్తానని శనివారం చెరువు వద్దకు వెళ్లి శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతీ మహిళ పౌష్టికాహారం తీసుకోవాలి

● మహిళా సంఘం సభ్యులకు అవగాహన

గుమ్మడిదల, సెప్టెంబరు 14: ప్రతీ మహిళ పౌష్టికాహారం తీసుకునేలా మహిళాసభ్యుల్లో చైతన్యం తీసుకురావాలని వెలుగు సమైక్య మహిళా సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం గుమ్మడిదలలోని వెలుగు సమాఖ్య భవనంలో పోషణ మాసం సందర్భంగా గ్రామ వెలుగు సమాఖ్య సంఘం-2 ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై మహిళలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వివిధ రకాల కూరగాయల తో జాతీయ జెండాను ప్రదర్శించి కూరగాయలతో పౌష్టికాహారం లభిస్తుందని తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని మహిళలకు వివరించారు. అంతేకాకుండా ఇందిరా మహిళాశక్తి విషయాలపై ప్రత్యేకంగా చర్చించి కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో వెలుగు సమైక్య సంఘం వీవోఏ బండి లక్ష్మి, అధ్యక్షురాలు నీరజ, ఉపాధ్యక్షులు స్వప్న, కార్యదర్శి స్వతంత్ర, ఉప కార్యదర్శి రాణి, కోశాధికారి కిచెన్నగారి మమత పాల్గొన్నారు.

పాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో..



పాతూరు అంగన్‌వాడీలో పోషణ్ మాసోత్సవాలు

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 14: మెదక్ మండలంలోని పాతూరు గ్రామ అంగన్‌వాడీలో శనివారం పోషణ్ మాసోత్సవాలు నిర్వహించారు. సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పి.శారద, కె.శారద మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందించే సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, పౌష్టిక ఆహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆశా వలంటీర్ సీహెచ్ లక్ష్మి, గర్భిణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆ గ్రామాలకు 'ఆర్టీసీ బస్సు' అందని ద్రాక్షేనా?

● కంది మండలంలోని 9 గ్రామాలకు బస్సు సౌకర్యం కరువు ● ఆటోలు, సొంత వాహనాలే దిక్కు ● పక్కగ్రామాలకు వెళ్లాలన్నా ఇక్కట్లే



బస్సు లేక ఆటోలో కిక్కిరిసి ప్రయాణిస్తున్న ఎర్దనూర్ గ్రామస్థులు



పదేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న ఉత్తర్‌పల్లి గ్రామస్థులు (ఫైల్)

కంది, సెప్టెంబరు 14: తలాపునే సముద్రం ఉన్నా దప్పిక తీరదన్న చందంగా మారింది కంది మండలంలోని పలు గ్రామాల పరిస్థితి. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి అతి సమీపంలోనే ఉన్న కంది మండలంలోని పలు గ్రామాలకు ఎన్నో ఏళ్లుగా బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఉత్తర్‌పల్లి, మక్తాఅల్లూరు, చిమ్నాపూర్, మామిడిపల్లి, తునికిళ్లతండా, వడ్డెనగూడతండా, ఎర్దనూరు, ఎర్దనూరు తండా, బ్యాతోల్‌తో కలిపి మొత్తం 9 గ్రామాల ప్రజలకు కొన్నేళ్లుగా బస్సు సౌకర్యం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఈ గ్రామాలన్నీ జిల్లా కేంద్రానికి 5 నుంచి 10 కిలోమీటర్ల లోపే ఉన్నాయి. ఏళ్ల తరబడి అధికారులు, పాలకులు బస్సు సౌకర్యం గురించి పట్టించుకోకపోవడంతో విద్యార్థులు, కూరగాయలు అమ్ముకునే రైతులు, పాల వ్యాపారులు కూడా ప్రైవేట్ ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. గ్రామస్థులు ఇతర పని మీద బయటకు వెళ్లాలంటే సొంత వాహనాలను వినియోగించాల్సిందే. ఆ గ్రామాల్లో పండించిన కూరగాయలు, పాలు, పండ్లు దగ్గరలోని మార్కెట్లకు తరలించాలంటే ఆటో చార్జీలు భరించలేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ తొమ్మిది గ్రామాల్లో ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడిన రైతులే ఉన్నారు. సొంత వాహనాలు లేని వారికి మండల కేంద్రానికి వెళ్లాలంటే నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. అంతేగాక గ్రామస్థులు ఎవరికైనా జ్వరంగాని, మరేదైనా అనారోగ్య సమస్యలు వస్తే సమయానికి ఆటోలు దొరక్క ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్ల క్రితం ట్రయల్స్ వేసినా..

కంది మండలంలో మొత్తం 22 గ్రామాలు ఉంటే అందులో ఉత్తర్‌పల్లి, మక్తాఅల్లూరు, చిమ్నాపూర్, మామిడిపల్లి, తునికిళ్లతండా, వడ్డెనగుడాతండా, ఎర్దనూరు, ఎర్దనూరు తండా, బ్యాతోల్ గ్రామాల్లో పదేళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు బస్సు నడపడానికి ట్రయల్ రన్స్ వేశారు. ఆయా రోడ్ల పరిస్థితులు, ఆ గ్రామాల్లో రోజువారి ప్రయాణికులపై ఆర్టీసీ అధికారులు సమగ్ర విచారణ చేసి నివేదికల సైతం తయారు చేసుకున్నారు. అయితే ఏమైందో కానీ ఏళ్ల గడిచినా ఆ గ్రామాలకు బస్సు సౌకర్యం అందని ద్రాక్షే అయ్యింది. ఆర్టీసీ బస్సు గ్రామాలకు వస్తే చార్జీలు తక్కువ ఉంటాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశించారు. ప్రస్తుతం పక్క గ్రామాలకు వెళ్లాలంటే ఆటో చార్జీలు రానుపోను కనీసం వంద రూపాయల వరకు ఖర్చు చేయాల్సివస్తుందని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని ఆశ్రయించక తప్పడం లేదని వాపోతున్నారు. గ్రామాల్లో పండించిన కూరగాయలు పాలు తదితర వస్తువులను తరలించడానికి ఆర్టీసీ బస్సులు అనువుగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకుని తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బస్సు లేక ఇబ్బందులు పడుతున్నాం



ఆర్టీసీ బస్సు మా గ్రామాల్లోకి వస్తే స్కూల్ పిల్లలకు, వృద్ధులకు ఎంతో సురక్షితంగా ఉంటుంది. మా గ్రామంలోని పిల్లలను పక్క ఊరి పాఠశాలకు పంపాలంటే ఆటోలు, ఆయా పాఠశాలల బస్సుల్లో పంపిస్తున్నాం. బస్సు సౌకర్యం లేక రైతులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతా అధికారులు వెంటనే స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

-శ్రీనివాస్, ఉత్తరపల్లి గ్రామస్థుడు

పక్క ఊరికి నడిచి వెళ్తున్నాం



దాదాపు పదేళ్ల గడిచినా మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించడంలేదు. జిల్లా కేంద్రానికి దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మా ఊరు, పక్కనే ఉన్న తండా ప్రజలంతా పక్క ఊరికి వెళ్లాలన్నా కనీసం ఆటోలు దొరకని దుస్థితి ఉంది. సొంత వాహనాలు లేని వాళ్ల నడిచే వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. మా ఊరి ప్రజలు పండించిన కూరగాయలు, పాలు పట్టణాలకు తరలించి అమ్ముకుందామంటే అది భారంగా మారింది. మా గ్రామానికి రోజుకు కనీసం ఒక్క ట్రిప్పు బస్సు సౌకర్యం అయినా కల్పించాలి.

-మధు, ఎర్దనూర్ గ్రామస్థుడు

పుస్తెలతాడు దొంగకు రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న పట్టణ సీఐ సాగరాజు

మెదక్, అర్బన్ 14: నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ పుస్తెల తాడును దొంగిలించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం మెదక్ పట్టణ సీఐ నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. కామారెడ్డి జిల్లాలోని లొంకలపల్లి గ్రామానికి చెందిన తోనిగండ్ల చిన్న దుర్గయ్య రెండు రోజుల క్రితం మెదక్ పట్టణంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ పుస్తెలతాడు దొంగిలించాడు. శనివారం పట్టణంలోని బోధన్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో పోలీసులు ఓ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ సందర్భంగా మహిళ పుస్తెలతాడును తానే దొంగిలించినట్లు దుర్గయ్య ఒప్పుకున్నాడు. దుర్గయ్య నుంచి ద్విచక్ర వాహనాన్ని మహిళను బెదిరించడానికి ఉపయోగించిన టెస్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు సీఐ తెలిపారు. దుర్గయ్య తోపాటు ఉన్న మరో వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

చెట్ల తిమ్మాయిపల్లిలో వివాహిత అదృశ్యం



మాలోతు లలిత

మాసాయిపేట, సెప్టెంబరు 14: మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయపల్లికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11న ఉపాధి హామీ డబ్బుల గురించి మాసాయిపేట మండల కేంద్రానికి వచ్చిన మహిళ మాలోతు లలిత(43) తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆమెకు ఫోన్ చేసినా స్పందన లేదని, సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు.

సుతార్‌పల్లి రైతు ఆత్మహత్య ఘటన.. సీఐ హామీతో సజావుగా అంత్యక్రియలు

రామాయంపేట, సెప్టెంబరు 14: రామాయంపేట మండలం సుతార్‌పల్లి గ్రామానికి చెందిన రైతు ఆత్మహత్య ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని సీఐ వెంకటరాజాగౌడ్ హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు. దీంతో శనివారం అంత్యక్రియలు సజావుగా కొనసాగాయి. మాజీమంత్రి హరీశ్‌రావు రైతు ఆత్మహత్య ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డికి ఫోన్ చేసి చర్యలపై ఆరా తీశారు. కాగా కాంగ్రెస్ నేతలపై కేసులు నమోదు చేస్తేనే ఆస్పత్రి మార్చురీ నుంచి మృతదేహాన్ని తరలిస్తామని శనివారం గ్రామస్థులు పోలీసులకు తెగేసి చెప్పారు. దీంతో సుమారు గంటపాటు బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నేతృత్వంలో గ్రామపెద్దలు సీఐతో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి అన్యాయం జరగదని హామీ ఇవ్వడంతో దీంతో సమస్య సద్దుమణిగింది. సాయంత్రం మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. అంత్యక్రియలు కొనసాగుతుండగా ఎలాంటి గొడవలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

తూప్రాన్ గీతాస్కూల్‌లో హిందీ దివస్

తూప్రాన్, సెప్టెంబరు 14: పట్టణంలోని గీతాస్కూల్‌లో హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హిందీ సంబంధిత విషయాలపై చిన్నారులు కవితలు, నాటికలు, నృత్యాలతో ఆలరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారావు హిందీ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. కరస్పాండెంట్ రామాంజనేయులు, చైర్‌పర్సన్ ఉష, డైరెక్టర్లు రాఘవేందర్ గౌడ్, నారాయణగుప్తా, హిందీ భాషోపాధ్యాయులు పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 14: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట హనుమాన్ ఆలయ ఆవరణలో శివశక్తి సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు భగవద్గీత, హనుమాన్ చాలీసా పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివశక్తి సంస్థ జిల్లా కార్యదర్శి శివాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ హిందువుల్లో భక్తి భావం పెంచేందుకు గ్రామ గ్రామాన భగవద్గీత, హనుమాన్ చాలీసాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

దళితులపై దాడులను అరికట్టండి

మాసాయిపేట, సెప్టెంబరు 14: మెదక్ జిల్లాలోని హవేళిఘణపూర్, మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి, మనోహరాబాద్ మండలం గౌతమిగూడెం తదితర గ్రామాల్లో దళితులపై దాడులు చేసి, వేధింపులకు గురి చేస్తున్నవారిపై జిల్లా ఉన్నతాదికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ పేర్కొన్నారు. మాసాయిపేటలో శనివారం ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ- అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు.

ఖేడ్‌లో భోగ్ భండార్

నారాయణఖేడ్, సెప్టెంబరు 14: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట జర్నలిస్టు కాలనీలోని భవానీమాత ఆలయ ఆవరణలో శనివారం ఖేడ్ నియోజకవర్గ స్థాయి భోగ్ భండార్, సేవాలాల్ మహారాజ్ భవానీ మాతకు ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఆర్ఐ కల్హేర్ మండలం మార్డికి చెందిన గుర్రపు మశ్చందర్, ఖేడ్ మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు సత్యపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌బాసిత్, మండల బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

● జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్
● పలు మండలాల్లో పార్టీ సభ్యత్వ నమోదు



మనోహరాబాద్: మండలాధ్యక్షుడు నరేందర్‌చారి ద్వారా బీజేపీ సభ్యత్వం స్వీకరిస్తున్న ఐలయ్య యాదవ్



మెదక్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో మాట్లాడుతున్న కిసాన్ సంఘ్ నాయకులు

జహీరాబాద్,సెప్టెంబరు 14: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీఎంపీ బీబీపాటిల్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో బీజేపీనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మోదీ నాయకత్వం మరింత బలపడాలంటే సభ్యత్వాలను విరివిగా చేపట్టాలన్నారు. కార్యకర్తలు, నాయకులు సంఘటితమై బీజేపీని బలోపేతం చేస్తు సభ్యత్వనమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో సభ్యత్వం భారీగా చేపట్టాలన్నారు.

● మనోహరాబాద్: మెదక్ జిల్లా మనోహ రాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌చారి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. మనోహరాబాద్ మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం వద్ద బీజేపీ సభ్యత్వ కన్వీనర్ లక్ష్మణ్‌సింగ్, గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ చేతుల మీదుగా నిర్వహించారు. మనోహరాబాద్ మండలం జిల్లాలోనే పెద్ద సంఖ్యలో బీజేపీ సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్, కార్యదర్శులు వెంకటేష్, శ్రీకాంత్, ఐలయ్య యాదవ్, నరేష్‌గౌడ్, బాలకృష్ణ, గోవర్ధన్, ప్రణయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

● మెదక్ కల్చరల్: భారతీయ కిసాన్ సంఘ్ మెదక్ జిల్లా కార్యకర్తల సమావేశం శనివారం మెదక్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో రాజా శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి పాల్గొని పార్టీ సభ్యత్వం, గ్రామ, మండల, జిల్లా కమిటీల గురించి చర్చించారు. సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలందరూ సెప్టెంబర్ 23 వ తేదీ మెదక్ పట్టణంలోని రామాలయంలో నిర్వహించే సమావేశంలో పాల్గొని ఎన్నికల నిర్వహణలో పాల్గొనాలని, ప్రతీ గ్రామం నుంచి 500 మంది రైతులను కార్యక్రమంలో పాల్గొనే విధంగా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్ కార్యకర్తలు చిక్కుళ్ల మైసయ్య, బండారి సురేష్, రాజేశ్వర్ రెడ్డి, సుభాష్ భాను, శ్రీనివాసరావు, నల్ల నారాయణ, నల్ల నారాయణ, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

పోచారంను అభినందించిన సురేష్ షెట్కార్



పోచారం శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న ఎంపీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 14: వ్యవసాయ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కలిసి అభినందించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

వృద్ధుల ఆరోగ్యానికి మోదీ భీమా



సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14: వృద్ధుల ఆరోగ్యానికి ప్రధాని మోదీ భీమా కల్పించారని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి చౌరస్తాలోని జిల్లా కార్యాలయంలో 70 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్స్‌కు ఆయుష్మాన్ భారత్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేయడాన్ని హర్షిస్తూ శనివారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రూ.5 లక్షల ఆరోగ్యబీమాను వర్తింపచేస్తూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనరసింహరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, కౌన్సిలర్ నాగరాజు, కార్యాలయ కార్యదర్శి విజయ్, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

అల్లాదుర్గం, సెప్టెంబరు 14: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరమవుతాయని అల్లాదుర్గం ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అల్లాదుర్గం ఐబీచౌరస్తా వద్ద జాతీయ రహదారి అధికారులతో కలసి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకువెళ్లరాదని, మద్యం సేవించి వాహనం నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో సీతారాం ఏచూరికి నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కల్హేర్, సెప్టెంబరు 14: సిర్గాపూర్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు శనివారం నివాళులర్పించారు. అనంతరం సీఐటీయూ నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కార్మిక పార్టీ లోకానికి తీని లోటని అన్నారు. ఏచూరి మరణం కార్మిక లోకంతో పాటు దేశానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సతీష్, లక్ష్మయ్య, సాయిలు, నర్సింలు పాల్గొన్నారు.

కోహీర్‌లో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కోహీర్, సెప్టెంబరు 14: కోహీర్‌లో ఏఐజీ హాస్పిటల్ హైదరాబాద్ వారు శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి 300 మంది వరకు హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఏఐజీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కోహీర్ గ్రామంలోని లాలకుంట, మిషన్ కాంపౌండ్, సంజీవ్‌నగర్ కాలనీ, బీమ్‌నగర్ కాలనీలో ఐదు రోజులపాటు ఇంటింటికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం శనివారం లాలకుంటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణములో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు వినీత్, హరిత్, సుదీర్‌రెడ్డి, ప్రవళిక, కృష్ణవేణి, వైద్య సిబ్బంది సాయికుమార్ సలమన్, చెందు, అఖిల రక్షిత జాంగిర్‌రాజు, నితిన్, విజయ్, బాలకృష్ణ, ప్రవీణ్ తదితరులు

ప్రైవేటు ఉపాధ్యాయులకు ప్రమాద బీమా

పటాన్‌చెరు, సెప్టెంబరు 14: నియోజకవర్గంలోని సుమారు 3 వేల మంది ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు రూ. 5 లక్షల ఉచిత ప్రమాద బీమా అందజేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రకటించారు. శనివారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ తదితరులు

జహీరాబాద్ , సెప్టెంబరు 14: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీఆర్టీయూ కృషిచేస్తుందని పీఆర్టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల బంజారభవన్‌లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం ఉద్యోగులకు డీఏను అంద జేయనుందని చెప్పారు. సమస్యల సాధనలో సంఘటితంగా పోరాటాలు చేస్తేనే ఆశించిన ఫలాలు దక్కుతాయన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదీలు, పదోన్నతులు కల్పించడంపై సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులను అందజేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వపాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీచేసి విద్యాభివృద్ధికి కృషిచేయాలన్నారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నాయకులు మదన్‌గోపాల్, మాణయ్య, తులసీరాంరాథోడ్, వరాలు, శ్రీనివాస్, సురేందర్, నర్సయ్య, విఠల్‌రెడ్డి, శ్రీశైలం, చంద్రురాథోడ్, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సంజీవన్‌రావుపేటలో అఖండ హరినామ సప్తాహ

నారాయణఖేడ్, సెప్టెంబరు 14: ప్రతి ఒక్కరిలో భక్తి భావం ఉండాలని హరిభక్త పారాయణ్ జ్ఞానేశ్వర్‌రెడ్డి మహరాజ్ అన్నారు. సంజీవన్‌రావుపేటలోని శ్రీ అనంతశయన మందిర ఆవరణలో నిర్వహించిన అఖండహరినామ సప్తాహ కార్యక్రమంలో ఆరో రోజు శనివారం ఆయన పారాయణం చేశారు. భక్తి భావం ఉంటే భగవంతుడి కృపకు పాత్రులవుతారన్నారు. కార్యక్రమంలో పూజారి ప్రవీణ్, తాజామాజీ సర్పంచు ఎంబరి విఠల్, తాజామాజీ ఎంపీటీసీ భూపాల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



జ్ఞానేశ్వర్‌రెడ్డి మహరాజ్‌ను సన్మానిస్తున్న భక్తులు

విద్యుత్ శాఖ సమస్యలను పరిష్కరించాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న రాకేష్

మెదక్, సెప్టెంబరు 14: విద్యుత్‌శాఖలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మెదక్ కాంగ్రెస్ నాయకుడు గోసెల రాకేష్ కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. మెదక్ పట్టణంలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల గురించి వారితో చర్చించినట్లు రాకేష్ తెలిపారు.

'విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి'

జహీరాబాద్,సెప్టెంబరు 14: విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మల్‌చెల్మ, తదితర గ్రామంలో విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు లక్ష్యామంటూ ఉంటేనే ఉన్నతంగా ఎదిగే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిచ్చిరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలతో ఆత్మీయత పెంపొందుతుంది



సంగారెడ్డిలోని విద్యానగర్ వినాయక మండపంలో మంత్రి దామోదర్ రాజనర్సింహతో నిర్వాహకులు



జహీరాబాద్‌లోని ఐడీఎస్ఎంటీ కాలనీలో గణేశుడికి పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బీబీపాటిల్

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 14: వినాయక నవరాత్రులను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. గజానంద్ యువజన సంఘం యువకుల ఆహ్వానం మేరకు సంగారెడ్డి పట్టణంలోని విద్యానగర్‌కాలనీ పోతిరెడ్డిపల్లిలో వినాయక విగ్రహానికి మంత్రి శనివారం పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్ని వర్గాలవారు వినాయక మండపాల వద్ద కలుసుకోవడం వల్ల ఆత్మీయత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పొన్న రాజేందర్‌రెడ్డి, యూత్ సభ్యులు ముఖేష్ చంద్ర నాయక్, ఆదిత్య, వివేక్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డి పట్టణంలోని కొత్తబస్టాండ్ వీరభద్రనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వీబీఎస్ మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భజన చేశారు.

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీ, తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకవిగ్రహాలకు మాజీ ఎంపీ బీబీపాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రామల్లో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గొల్లభాస్కర్, విజేందర్ రెడ్డి, నౌబాద్‌జగన్, మంజులాకైలాస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని రాచన్నపేటలో వినాయక మండపం వద్ద మహిళలు భగవద్గీత పారాయణం చేశారు.

● నారాయణఖేడ్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖేడ్ పట్టణంలోని ఏఎస్‌నగర్ కాలనీలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేష్ మండపంలో శనివారం శ్రీలలితాదేవి వైభవం ట్రస్టు ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి లక్ష బిల్వార్చన, లక్ష పత్తి వస్త్ర సేవ, గణేష సంకట నాశన స్తోత్ర పారాయణం తదితర కార్యక్రమాలను బ్రహ్మశ్రీ మలమంచి మోహన్ జోషి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

● గుమ్మడిదల: గుమ్మడిదలలోని సిద్ధి వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమం అందరినీ ఆకర్షించింది. గత 19 ఏళ్లుగా ఈ వినాయక మండపం సభ్యులు ఆనవాయితీగా అరటి ఆకుల్లో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎంత మంది వచ్చినా ఒకవరుసలో కూర్చుని అరిటాకుల్లో భోజనం చేసి సంతృప్తిగా వెళ్తున్నారు. శనివారం సిద్ధి వినాయక మండపం వద్ద ఈసారి కూడా భక్తులకు వినాయక మండపం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి లైన్ అరిటాకుల్లో భోజనం చేసి సంతృప్తితో వెళ్లారు.

● మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలో శనివారం చమన్, ఫతేనగర్, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. శనివారం వక్రతుండ గణేష్ మండపం వద్ద పుష్పాభిషేకం నిర్వహించగా, వీరహనుమాన్ కాలనీలోని మండపం వద్ద శుక్రవారం రాత్రి మహిళలు కుంకుమార్చన చేశారు. పట్టణంలో ఏటా 11 రోజులకు నిమజ్జన కార్యక్రమం నిర్వహిస్తుండగా ప్రముఖ పంచముఖి గణేష్ మండలి వారు ఈసారి తొమ్మిది రోజులకే నిమజ్జనం చేస్తుండం విశేషం. ఇందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నిమజ్జనం కోసం కొంటూరు చెరువు వద్ద లైటింగ్ ఏర్పాటుతో పాటు బారీకేడింగ్ నిర్మించినట్లు చైర్మన్ చంద్రపాల్ తెలిపారు.

● పాపన్నపేట: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వేడుకలు నిర్వహించారు. పాపన్నపేట నవయువ సేవా సంఘం గణేష్ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, తదుపరి అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్ గుప్తా, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, నిర్వాహకులు తదితరులున్నారు.



మెదక్ మున్సిపాలిటీ: వీరహనుమాన్ కాలనీలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

● చిన్నశంకరంపేట: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద భక్తులు గణపతి హోమం, పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

● చిలప్‌చెడ్: మండలం పరిధిలోని పలు వినాయక మండపాలకు చిట్కూల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తారా విష్ణువర్ధన్‌రెడ్డి పెద్దఎత్తున చందాలను అందజేశారు. శనివారం మండలానికి చెందిన పలు గ్రామాల్లోని సుమారు 12 వినాయక మండళ్ల కమిటీల వారికి మొత్తం రూ. 85,500 అందించారు.